# తేచిన వేళ...

ఆ వీధిలో కాస్సేపటి కిందటే శవం వెళ్ళినట్టుంది. అంతటా పూలరేకులు, బుక్కాయి, రంగులు ఉన్నాయి. వీధి లైట్లు మందంగా నామమాత్రంగా మాత్రమే వెలుగుతున్నాయి.

కోటిగాడు చేతిలో చీపురు మరో చేతిలోకి మార్చుకుని ముక్కు తుడుచుకున్నాడు. ఆ తర్వాత ఆ కాస్త వెలుతురు లోనే చుట్టూ జాగ్రత్తగా పరిశీలించాడు.

శవం మీద పూలు, బుక్కాయిలతో పాటు చిల్లర నాణాలు కూడా విసురుతూ ఉంటారు. 'అవేమయినా దొరక్కపోతాయా' అని ఆశతో చూట్టూ చూశాడు.

ఎక్కడా ఏమీ కనబడలేదు. 'శవం తాలూకువాళ్ళు మహా పిసినారులయి ఉంటారు' అనుకున్నాడు.

ఆ తర్వాత 'ఎక్కడయినా కాస్సేపు కూర్చుంటే మంచిది' అనిపించింది.

చూస్తే ఎదురుగా ఒక ఇంటి ముందు ఖాళీ గడప కనిపించింది. గుమ్మం వేసి ఉంది. వెళ్ళికూర్చున్నాడు.

వీపు మధ్యలో నిలువుగా పడిన కర్రదెబ్బ.... ఇప్పుడు అమిత మంటగా ఉంది. చిరుగుల బనీనులో నుంచి చేయి పోనిచ్చి అక్కడ రుద్దుకున్నాడు. అది మామూలు కర్ర కాదు. పేముకర్ర....తన ముంజేయి అంత లావు. పోలీసుల చేతిలో ఉండేది పేముకర్రే. దెబ్బ మహా గొప్పగా తగులుతుంది. తగిలినంత మేర చర్మం ఊడి వచ్చేస్తుంది.

ఇంతకుముందు చాలా సార్లు స్టేషనులోనుంచి పోలీసులు తరిమి కొట్టారు. కానీ, దెబ్బలు మటుకు ఎన్నడూ పడలేదు. కోటిగాడికి కళ్ళలో నీళ్ళు ఉబికి వచ్చాయి. వీపు మీద దెబ్బలు తగిలిన చోట అమిత బాధగా ఉంది.

అంతలో వెనుక తలుపు తెరుచుకుంది. గుమ్మం ఇవతలకి వెలుతురు చార పడింది. ఒక నీడ.

ఎవరో అరుస్తున్నారు - 'ఎవ్రరా అది?' అని. ఆ గొంతు మొరటుగా ఉంది. కోటిగాడు లేచాడు.

ఆ వ్యక్తి మళ్ళీ అంత మొరటుగానూ "పో....పో.... ఇక్కణ్ణుంచి" అన్నాడు.

కోటిగాడు లేచి ముందుకు నడిచాడు.

ఆ పైన రోడ్డు అంతా డ్రెయినేజి గొట్టాల కోసమో, మరెందుకో తవ్వేసి ఉన్నారు. 'ఇక అటు పోతే ప్రమాదం' అనుకుని వెనుదిరిగి నడిచాడు.

ఎదురుగా పెద్ద హోటలు....నాలుగో, అయిదో అంతస్తుల హోటలు.... దరిదాపులలో ఎక్కడా కరెంటు కోత వల్ల వెలుతురు లేకపోయినా, ఆ హోటలు మాత్రం మహా వైభవంగా కళకళ లాడుతున్నది. లోపల ఎక్కడ నుంచో పెద్ద జనరేటర్ శబ్దం వినబడుతున్నది.

హోటలు ముందు చాలా వాహనాలున్నాయి.

ఎన్నో ఖరీదైన, అపురూపమైన కార్లు తళతళ లాడుతున్నాయి. రంగు రంగుల స్కూటర్లు ఇతర వాహనాలు మెరుస్తున్నాయి. ఆపైన కొన్ని సైకిళ్ళున్నాయి. కోటిగాడు అనవసరంగా కూనిరాగం తీస్తూ నిలబడ్డాడు. చేతిలో చీపురు నేల మీద పడేశాడు. గోడకానుకున్నాడు.

'చింపిరిగాడు ఎటు పోయాడు? నిప్పుకోడిగాడు ఎటు పారిపోయాడు? బుజ్జమ్మ ఏమయింది?' ఇవన్నీ ప్రశ్నలు....

పినాకినిలో దిగీదిగగానే "మంచి నీళ్ళు తాగుదాం....దాహం" అంది బుజ్జి. నలుగురూ చేతుల్లో చీపుళ్ళతో 'చల్లని త్రాగే నీరు' అని రాసి ఉన్న చోట నిలబడ్డారు. ఎవరో ఒకాయన పెద్ద సీసా పదిసార్లు కడిగి కడిగి నీళ్ళు పట్టుకుంటున్నాడు.

అంతలో వెనుక బూట్ల చప్పుడు గుండెలు చెదరగొడుతూ వినిపించింది. బుజ్జమ్మ 'పారిపోండి....పారిపోండి' అంటూ అరిచి వెనుకవైపు చీకటిలోకి పారిపోయింది. తన వెనుక వైపు నుంచి ఈ ప్రమాదం వచ్చి పడటం వల్ల తాను జాగ్రత్త పడలేక పోయాడు. వీపు మీద పడనే పడింది దెబ్బ. ఒక్కసారిగా వీపు మధ్యలో పది, పదిహేను తేళ్ళు కుట్టినట్టు, కాల్చిన అట్లకాడ ఉంచినట్టు అనిపించింది.

'అమ్మో' అని అరిచి తాను కాళ్ళకు బుద్ధి చెప్పాడు. అయితే, ఎదురుగా ఉన్న మెట్లెక్కి బ్రిడ్జి మీద పరుగెత్తి స్టేషను ఇవతలి వైపుకు వచ్చి పడ్డాడు. అయిందా, ఇప్పుడు వీపు మీద మంట బాగా ఎక్కువయింది.

ఇక క్రమంగా కడుపులో ఆకలిమంట కూడా ఎక్కువ అవుతున్నది. పినాకినిలో పెట్టెలూడ్చి తర్వాత ధర్మాత్ములుకొందరు దయతలిచి విదిల్చిన డబ్బులు అయిదో, ఆరో రూపాయలు - నిప్పుకోడి గాడి దగ్గర ఉండిపోయాయి.

తన దగ్గర చిరుగుల లాగూ వెనుక జేబులో ఒక యాభై పైసల నాణెం మాత్రం ఉంది. మరో రెండు రూపాయల పైన ఉంటే గాని ఆకలి అంతంత మాత్రంగా నైనా తీరదు.

వాడు ఎదురుగా చూస్తూ, 'ఈ హోటల్లో భోజనం ఎంతవుతుందో' అనుకున్నాడు.

ఒకప్పుడు చింపిరిగాడు ఏదో మాటల సందర్భంలో పెద్ద 'పెద్ద హోటళ్ళలో భోజనం రేటు వంద రూపాయలు పైమాటే' అన్నాడు.

"వంద రూపాయలకు ఏం పెడతారో అక్కడ'' అని అందరూ ఆశ్చర్యపోయారు.

తాము తిండి తినేచోటు.... స్టేషను ఇవతల రోడ్డు పక్కన పేవ్‌మెంట్ మీద కూర్చుని ఉంటుంది అచ్చమ్మ. నలభై ఏళ్ళుంటాయేమో, నల్లగా చింతపండు బస్తాలాగానో, బొగ్గుల బస్తాలాగానో ఉంటుంది. పక్కన పెద్ద అన్నంగిన్నె, ఒక పులుసు గిన్నె, ఒక పచ్చడి గిన్నె వుంటాయి. జర్మన్ సిల్వర్ ప్లేట్లు చిన్నవి నాలుగో, అయిదో. ఆ పక్కనే పెద్ద వెడల్పాటి గిన్నెలో నీళ్ళు.... ఒకరు తిని వెళ్ళగానే ఆ పళ్ళెం అందుకుని నీళ్ళలో ముంచి తీసి గరిటెతో రెండు ముద్దలు అన్నం పెట్టి, పైన పులుసుపోసి, కాస్త పచ్చడి విదిలించి ఇస్తుంది. మళ్ళీ ఎవరైనా

కొంచెం అన్నం అడిగితే "సచ్చినోడా! ఇంతలేవు.... నీ కెంత ఆకలిరా? మింగు" అని మరో గరిటెడు అన్నం పడేస్తుంది.

అక్కడ వున్న రెండు, మూడు భోజన హోటళ్ళలో మధ్యాహ్నం మిగిలిన అన్నం కొనుక్కొచ్చి, పులుసు కాచి తెచ్చి ఈ వ్యాపారం సాగిస్తుంటుంది. తిండి అంతా కలిపి రెండున్నర రూపాయలు. అది తిని, ఇన్ని మంచినీళ్ళు తాగితే సరి.... నిద్ర ముంచుకు వస్తుంది. స్టేషనులో హాలు గోడవారగా ఏ మూలనో కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకోవడమే.

కోటిగాడు కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు.

పెద్ద పూల రథంలాంటి కారులో నుంచి దిగి ఎవరో సినిమా తార, మరొక తారడూ హోటలు లోపలికి వెళ్తున్నారు. వారి వెంట కొందరు కోలాహలంగా నడుస్తున్నారు.

కోటిగాడికి ఆ తారపేరు గుర్తు రాలేదు. బుజ్జమ్మ అయితే బొమ్మ చూడగానే ఎవరెవరో వారి బిరుదులతో సహా గడగడ చదివేస్తుంది. నిమిషాలలో అంతా సద్దుమణిగింది.

కోటిగాడు చీపురు అందుకుని లోపలికి నడిచాడు. జేబులో నుంచి గుడ్డతీసి విదిలించి చివరగా ఉన్న కారు తుడవడం ప్రారంభించాడు. అది మహా ఖరీదయిన కారు. లక్షలు చేస్తుందేమో, అద్దాలు వేసి ఉన్నాయి. అవి నల్లటి అద్దాలు కావడంవల్ల లోపల ఎలా ఉందో అసలు కనిపించడంలేదు.

అంతలో వెనకనుంచి ఎవరో వచ్చారు.

"ఏరా! ఎవర్నువ్వు?" అన్నారు.

కోటిగాడు వెనుదిరిగి చూశాడు. ఒక ఖరీదైన కుటుంబం— నడివయసు వ్యక్తి ఖరీదైన దుస్తులలో కళకళలాడుతున్నాడు. పక్కనే సినిమా తారలను తలదన్నే ఆడమనిషి ఖరీదైన చీరలో మెరిసిపోతున్నది. ఆ పక్కనే తన ఈడువాడే రంగుల బంతిలా వెలిగిపోతున్న కుర్రవాడు.

"తుడిచానండి" అని నసిగాడు కోటిగాడు దణ్ణంపెట్టి.

ఆ వ్యక్తి ఏమనుకున్నాడో ఏమో. జేబులో వెదకి ఒక రూపాయి బిళ్ళతీసి విసిరేసి, మళ్ళీ అంతలోనే చిరాకుగా ముఖం పెట్టి, "నిన్నెవరు తుడవమన్నారు వెధవా?" అని కసురుకున్నాడు.

కోటిగాడు వంగి రూపాయిబిళ్ళ తీసుకుని నిలబడ్డాడు. కారు తలుపులు తీస్తే లోపల అంతా కళ్ళకు అద్భుతం అనిపించింది. క్షణాల్లో వారు కారెక్కి వెళ్ళిపోయారు. మెత్తగా, నిశ్శబ్దంగా కారు ఆవరణలో నుంచి బయటికి జారిపోతుంటే, కోటిగాడు కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు.

అంతలో చేతికర్ర జుళిపిస్తూ వచ్చాడు వాచ్‌మన్. అతని గొంతు భీకరంగా ధ్వనించింది.

"రేయ్.... దొంగనాయాలా! ఎట్టాఒచ్చావురా లోపలికి ? టీ కోసం వెళ్ళొచ్చే లోపల దూరిపోయావే. పద, పద."

కర్ర మెడమీదపెట్టి కోటిగాడిని తోసుకుంటూ గేటుదాకా తెచ్చి "వెళ్ళెళ్ళు. ఈసారి ఈ పక్కల ఎక్కడన్నా కనిపించావా, బొమికె లిరగ్గొట్టేస్తా" అంటూ విడిచి పెట్టాడు.

కోటిగాడు మళ్ళీ రోడ్డుమీద పడ్డాడు.

ఈ మహా నగరంలో స్టేషనూ, పరిసర ప్రాంతాలు తప్ప వాడికి ఏమీ తెలియదు. ఎక్కడికన్నా వెళ్ళాలన్నా భయమే. ఊహ తెలిసినప్పటి నుంచీ ఈ పెద్ద స్టేషనే వాడి ప్రపంచం. ప్లాట్‌ఫారం మీదా, రైలు పెట్టెల్లోనే బతుకు.

మూడు నాలుగు రోజుల క్రిందట ఒకాయన స్టేషనుకు వచ్చి తమను ఒక చోట కూర్చోబెట్టి తమను గురించి అంతా తెలుసుకున్నాడు. పత్రికలో రాస్తానని చెప్పాడు. ఫోటోలు కూడా రెండు, మూడు తీసుకుపోయాడు. బుజ్జమ్మ తన చీమిడి ముక్కు గౌనుతో తుడుచుకుని, చేతిలో చీపురుతో, చిరుగుల గౌనుతో, అట్టకట్టిన పాడు చింపిరి జుట్టుతో పెద్ద సినిమా తారలాగా పోజు కూడా ఇచ్చింది. బహుశా పత్రికలో తమను గురించి ఆ పెద్దమనిషి ఫోటోలతో సహా అచ్చువేసి ఉంటాడు. దాని ఫలితమే కాబోలు ఇవాళ పోలీసుల దాడి.

తామేమి మహాపాపం చేస్తున్నారు?

రైళ్ళలో సూట్‌కేసులు దొంగిలించడం లేదు. జేబులు కొట్టడం లేదు, ఆడవాళ్ళ మెడలలో గొలుసులు లాగేయడంలేదు. బరువులు మోస్తామని లైసెన్స్ కూలీలకు పోటీ వెళ్ళడం లేదు. తాము చేస్తున్నది నేరం కాదు సరికదా ఒక విధంగా మంచిది కూడాను.

మన రైళ్ళు ఎలా ఉంటున్నాయి? ఎంత శుభ్రంగా బయల్దేరిన రైలయినా గమ్యం చేరేసరికి ఎలా వుంటుంది? పరమరోతగా, అసహ్యంగా, ఛండాలంగా

వుంటున్నది. రకరకాల జనం ఉంటారు. రైల్లో వాళ్ళకు ఎక్కడలేని ఆకలి వేస్తుందో ఏమో మరి. రకరకాల తిండ్లు తింటారు. అరటిపళ్ళు ఆబగా తిని, ఆ తొక్కలు అక్కడే పడేస్తారు. వేరుసెనగ కాయలు వొలుచుకుతిని, ఆ తొక్కలూ అక్కడే పడేస్తారు. బత్తాయిలు, నారింజలు ఒలుచుకుతిని ఉమ్మేస్తారు. ఇంకా ఎన్ని రకాల చెత్తా చెదారమూ చేరుతుందో చెప్పలేము.

అప్పుడు ఈ అనాధ పిల్లలు వస్తారు. మోకాళ్ళమీద కూర్చుని పాకుతూ చీపుళ్ళతో పెట్టె అంతా చిమ్ముతుంటారు. చెత్తఅంతా ఒక్కచోట పోగుచేసి హాయిగా కూర్చుని వున్న ప్రయాణీకుల ముందు చేతులు చాపుతారు. దయగల తండ్రులు, దయగల తల్లులు పదిపైసలో, ఇరవైపైసలో, మరీ ధర్మబుద్ధిగల వార యితే యాభైపైసలో పడేస్తారు. ఆ విధంగా రోజుకు రెండేసి వందల మైళ్ళు ప్రయాణం చేసి పెట్టెలు శుభ్రం చేసి, వచ్చిన డబ్బులతో ఎక్కడో ఒకచోట అర కొర తిండి తిని బతుకు తుంటారు. సాధారణంగా మంచినీళ్ళతోనే వాళ్ళ కడుపులు ఎక్కువ భాగం నిండుతుంటాయి. ఎప్పుడో తప్ప ఉద్యోగులు, పోలీసులు కూడా వారిని అట్టే వేధించరు, జాలితో ఊరుకుంటారు. స్టేషనులో తిరగనిస్తూ ఉంటారు.

ఇదిగో ఇప్పుడు బహుశా ఆ పేపరువాడివల్లే తంటావచ్చివుంటుంది. పోలీసులదే ముంది? పైవాడు వాళ్ళమీద మండిపడివుంటాడు. వాళ్ళు తప్పనిసరై వీళ్ళమీదపడ్డారు.

ఇక్కడ పెద్ద సినిమా హాలు....ఒకటి కాదు — ఒకే ఆవరణలో మూడు సినిమా హాళ్ళు.

రెండో ఆట మొదలు పెట్టినట్టున్నారు. బయటఅంతా లైట్లతో పట్టపగలులా వుంది. ముందు పెద్ద పెద్ద బొమ్మలు. ఒకవైపు పిస్తోలు పట్టుకుని ఒకడు ఎవరినో కసిగా కాల్చివేసే భంగిమలో ఉన్నాడు. మరొకాడు మెలికలు తిరుగుతూ విచిత్ర మయిన దుస్తులు వేసుకొని నాట్య భంగిమలోఉన్నాడు. ఒకడు నోట్లో పెద్దపైపు పెట్టుకుని వికృతంగా చూస్తున్నాడు. ఒక అమ్మాయి బట్టలు లేకుండా వెల్లకిలా పడుకుని ఉంది.

కోటిగాడికి ఆకలి ప్రబలింది. కడుపులో పెద్ద నిప్పుల చక్రం ఒకటి గిరగిర తిరుగుతున్నట్టు అనిపిస్తున్నది. జేబులో రూపాయియాభైపైసలు మాత్రం ఉన్నాయి. వట్టి టీ తాగినా రూపాయి పావలా అయిపోతుంది.

ఆకలితో పాటు వాణ్ణి వేధిస్తున్న ప్రశ్నమరొకటి ఉంది. 'మిగిలిన వాళ్ళు ఏమైపోయారు?'

'బహూశా కాస్సేపు ఎక్కడో నక్కి కూర్చుని తర్వాత హైదరాబాద్ ఎక్స్ ప్రెస్‌లో వెళ్ళిపోయి ఉంటారు' అనుకున్నాడు.

తానొక్కడూ దిగబడిపోయినట్టు తెలుస్తూనే ఉంది. లేకపోతే స్టేషను పరిస రాల్లో తనకు కనబడి ఉండేవాళ్ళే.

వెలుతురు మరింత మందగించింది.

దూరంగా రోడ్డు పక్కన అచ్చమ్మ అలాగే కూలబడి వుంది. బేరం అయి పోయినట్టున్నది. పక్కన ఒకామెతో మాట్లాడుతున్నది.

ఎదురుగా వీధి దీపం వెలుతురు....పల్చగా.

కోటిగాడు అక్కడికి వెళ్ళి నిలబడ్డాడు, చంకలో చీపురుతో.

అచ్చమ్మ తన ధోరణిలో తాను మాట్లాడు తున్నది.

"సచ్చినోడు-ఆడి జిమ్మడ-అణ్ణి నమ్ముకొని ఇట్టా అయిపోయినాను. నా గొలుసూ, గాజులూ కాజేసి పిల్లణ్ణీ నన్నూవదిలేసి లేసిపోయినాడు. నేను దాన్ని అను మానించనే లేదమ్మా....తల్లీ....ఎంత అమాయకంగా 'అక్కా అక్కా' అంటూఉండే దనుకున్నావు? కొంపలు తీసే రకమని కానుకోలేకపోయానే అమ్మా".

కళ్ళు చెమర్చాయి కాబోలు మాటలు ఆపి, చీర చెంగుతో తుడుచుకుంది.

అంతలో కోటిగాడి వంక చూసి గొంతు మార్చింది.

"ఏరా, ఎక్కడ సచ్చావింతసేపూ? ఇయ్యాళ మీ ఎదవగుంపంతా ఏమయింది? ఒక్కళ్ళూ రాలేదు" అన్నది.

కోటిగాడు కూర్చున్నాడు.

అచ్చమ్మ ప్లేటు అందుకుంది, అన్నంగిన్నెమీద మూత తీసింది.

కోటిగాడు గొణిగాడు. "నా దగ్గర రూపాయున్నరే ఉంది."

అచ్చమ్మ ఆగింది. చురుగ్గా చూసింది.

"రూపాయిన్నరే ఉందా? సచ్చినోడా! రైలుపెట్టెలూడ్చి సంపాయించిన డబ్బంతా సినిమాలకు తగలేశారా ఏం?"

"పోలీసోళ్ళు తరిమికొట్టారు. ఎటువాళ్ళం అటు పారిపోయాం. ఆళ్ళు ఎటు పోయారో తెలీదు. డబ్బులన్నీ నిప్పుకోడిగాడి దగ్గరుండిపోయాయి."

"అబద్ధాలు" అన్నది పక్కన కూర్చున్న మనిషి.

"ఒట్టు" అన్నాడు కోటిగాడు.

"సచ్చినోడా, తినిసావు" అన్నది అచ్చమ్మ ప్లేటులో అన్నం పెట్టి. నీళ్ళు ముంచి పక్కన పెట్టింది.

మళ్ళీ మొదలు పెట్టింది.

"అట్టా అయిపోయిందమ్మా నా బతుకు. ఇక మళ్ళీ ఊరికి ఏ మొకం పెట్టుకుని పోను? లేసిపోయినదాన్ని ఇంటోకి రానిస్తారా మావాళ్ళు? కాళ్ళిరగగొడతారు. నన్ను నట్టేట్లో ముంచిపోయి ఆడుమటుకు సుకపడతాడాయేం? పురుగులు పడి సస్తాడు."

పక్కనున్నామె "అసలు మగాణ్ణి ఎందుకులే అనుకోవడం? మన ఆడాళ్ళకుండాలి బుద్ధి" అన్నది.

అచ్చమ్మ కోటిగాడి వంక చూసింది.

"ఏరా"? అన్నది.

కోటిగాడు పళ్ళెం అలా పట్టుకునే ఉన్నాడు.

"సచ్చినోడా-ఇంకా ఆకలి తీరలేదా" అని నవ్వుతూ "ఇంద....మింగిసావు" అని మరో రెండు గరిటెలు అన్నం వేసి పులుసు పోసింది.

కోటిగాడు ఆబగా తింటున్నాడు.

'ఇయ్యాళ గడిచింది....ఎన్నాళ్ళో ఇట్టా' అని పైకే అనుకుంది అచ్చమ్మ.

అన్నీ సర్దుకుంది. తర్వాత చెయ్యి జాపి "తే డబ్బులు" అన్నది.

కోటిగాడు డబ్బులిచ్చాడు.

డబ్బులందుకుని, మూటలో వేసుకుని ముడి లాగి నడుముకు దోపుకుంటూ 'ఎదవలు-ఈ డబ్బులు కాసినీ జాలిపడి తీసుకోకపోతే ఈటితో సిగరెట్లు కాల్చి చెడిపోతారు. రేపట్నుంచీ ఆబద్దాలే ఆడతారు' అనుకుంది.

కోటిగాడు లేచి నడిచి స్టేషన్ దగ్గిరికి వచ్చి నీడలో కొన్ని క్షణాలు నిలబడ్డాడు.

లోపల ప్రయాణీకుల అలజడి బాగా తగ్గింది. లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అక్కడక్కడ కొందరు ప్రయాణీకులు నేల మీదనే పడుకుని ఉన్నారు పిల్లా పాపలతో.

కోటిగాడు పిల్లిలాగా నడిచాడు. తనకు బాగా అలవాటయిన తన చోటు గోడ మూల ఖాళీగా ఉంది. లోపలికి వెళ్ళి గోడకానుకుని కూలబడ్డాడు. తర్వాత ఆవులించి చీపురు తలకింద పెట్టుకుని వెల్లకిలా పడుకున్నాడు.

దూరంగా మెట్ల చివర ఒక పోలీసు నిలబడి ఉండి తీరిగ్గా సిగిరెట్టు కాలుస్తున్నాడు. కోటిగాడి వంక చూస్తూనే ఉన్నాడు. కోటిగాడు కళ్ళుమూసుకున్నాడు. కడుపులో ఇంత తిండి పడడంతో నిద్రముంచుకుని వస్తున్నది. మళ్ళీ ఆవులించాడు.

అంతలో పక్కన అలికిడి విని లేచాడు. 'హి....హి....హీ' అని పళ్ళు బయటపడేలా నవ్వాడు.

పోలీసు కూడా నవ్వుతూనే "ఇందాక బాగా పడ్డాయా దెబ్బలు" అని అడిగాడు.

కోటిగాడు తలవూపి "వీపు ఇంకా మండుతున్నది" అని గొణిగాడు.

"మిగిలిన ఎదవలందరూ ఏరీ ?"

కోడిగాడి కళ్ళలో దిగులు. దీనంగా, "ఏమో, ఎటుపారిపోయారో ఒక్కళ్ళూ కనబళ్ళేదు" అన్నాడు. తర్వాత ఒక్కక్షణం ఆగి, "లేచినయాళ అట్టాటిది" అని నవ్వాడు.

పోలీసు నెమ్మదిగా కదిలి వెళ్ళిపోయాడు.

కోటిగాడు ధైర్యంగా నడుం వాల్చాడు. కాలు మీద కాలు వేసుకున్నాడు.

ఆవులింతలతో నిద్రముంచు కొచ్చింది.

'రేపీపాటికి అందరూ వొస్తారు' అనుకున్నాడు. పక్కకు తిరిగి చీపురును కౌగలించుకుని పడుకున్నాడు.

తర్వాత కొద్దిసేపట్లోనే వాడికి నిద్రపట్టింది.

నిద్రలో....తాను విచిత్రమైన బట్టలు వేసుకుని, పిస్తోలుతో ఎవరినో కాల్చబోతున్నాడు. చింపిరిగాడు నోట్లో పైపు పెట్టుకుని, కోటు ధరించి కళ్ళద్దాలతో నిలబడి ఉన్నాడు. నిప్పుకోడిగాడు గాలిలోకి ఎగిరి ఎవరో అదృశ్య వ్యక్తులను కాళ్ళతో తన్నబోతున్నాడు బుజ్జమ్మ బొత్తిగా బట్టలు లేకుండా సముద్రం పక్కన ఇసుకలో వెల్లకిలా పడుకుని ఉంది.

వాడు అంతలో కదలి మరోపక్కకు తిరిగి పడుకుని గాఢనిద్రలో మునిగిపోయాడు.

పోలీసు అటువైపు చూసి ఎందుకో తనలో తాను నవ్వుకున్నాడు. *